సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ


శనివారం । 22 । మార్చి । 2025



త్వరలో కొత్త ట్రస్ట్ బోర్డు?

అన్నవరం వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి త్వరలో నూతన ధర్మకర్తల మండలిని నియమించనున్నారు.

8లో



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 3,200, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి జలాలను విడుదల చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శనివారం (సాయంత్రం)	సహర్ ఆదివారం (ఉదయం)
రాజమండ్రి	6.22	4.44
కాకినాడ	6.24	4.44
అమలాపురం	6.24	4.44

న్యూస్‌రీల్

తెలుగును ద్వితీయ భాషగానే కొనసాగించాలి

ఇంటర్ తెలుగు అధ్యాపకుల వినతి



డీఐఈవో సోమశేఖరరావుకు వినతి పత్రం అందజేస్తున్న తెలుగు అధ్యాపకులు

అమలాపురం టౌన్: ఇంటర్మీడియెట్ విద్యలో తెలుగును ద్వితీయ భాషగానే కొనసాగించాలని వివిధ జూనియర్ కళాశాలలకు చెందిన 52 మంది తెలుగు అధ్యాపకులు డీఐఈవో వనుము సోమశేఖరరావును కలిసి శుక్రవారం వినతి పత్రం అందించారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పరీక్షలకు సంబంధించి జరుగుతున్న జవాబు పత్రాల మూల్యాంకనం క్యాంపు కేంద్రం వద్ద డీఐఈవోను తెలుగు అధ్యాపకులు కలసి తెలుగు ద్వితీయ భాష గురించి మాట్లాడారు. ఇంటర్మీడియెట్ విద్యలో జరుగుతున్న పాఠ్యాంశాల సంస్కరణల్లో భాగంగా మాతృ భాష తెలుగును ద్వితీయ భాషగా ఉంచాలని, ఐచ్ఛిక భాషగా చేయవద్దని విజ్ఞప్తి చేశారు. మూల్యాంకనం క్యాంపు కేంద్రం వద్ద తెలుగు సబ్జెక్ట్‌ను ఐచ్ఛికంగా మార్చవద్దని తెలుగు అధ్యాపకులు నినాదాలు చేసి ఆందోళన వ్యక్తం చేశారు. క్యాంపు ఆఫీసర్, డీఐఈవో సోమశేఖరరావు మాట్లాడుతూ వారి వినతిని ఇంటర్మీడియెట్ కమిషన్ దృష్టికి తీసుకుని వెళతానని చెప్పారు. తెలుగు అధ్యాపకులు బి.బాబూరావు, నల్లా నరసింహమూర్తి, డి.శ్రీనివాస్, డి.ప్రభాకరరావు, మంగం శ్రీనివాసరావు, ఆకొండి ధన్వంతరి, స్వర్ణకుమారి వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

పది పరీక్షలకు 18,903 మంది హాజరు

ముమ్మిడివరం: పదో తరగతి పరీక్షల్లో మూడవ రోజు శుక్రవారం ఇంగ్లిషు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో 22 మండలాల్లో 110 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 18,999 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా ఇంగ్లిషు పరీక్షకు 18,903 మంది విద్యార్థులు హాజరయ్యారు. 96 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 9 నుంచి 12.45 గంటల వరకు పరీక్షలు రాశారు. 18,898 మంది రెగ్యులర్, ఐదుగురు ప్రయివేటు విద్యార్థులు పరీక్షలు రాశారు. మొత్తం 99.49 శాతం మంది పరీక్షలకు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా తెలిపారు. పరీక్షా కేంద్రాలను డీఈవో, డీవైఈవో జి.సూర్యప్రకాష్, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బి.హనుమంతరావుతోపాటు ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు జిల్లాలో మొత్తం 39 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె వాయిదా

రాజమహేంద్రవరం సిటీ: సమస్యల పరిష్కారానికి ఈ నెల 24, 25 తేదీల్లో జరపతలపెట్టిన బ్యాంకు ఉద్యోగుల సమ్మెను వాయిదా వేస్తున్నట్లు జిల్లా బ్యాంకు ఉద్యోగుల సంఘం కార్యదర్శి లక్ష్మీపతిరావు, నాయకులు శేషుకుమార్, పాపారావు తెలిపారు. బ్యాంక్ యాజమాన్యాలు, సెంట్రల్ లేబర్ కమిషనర్‌తో శుక్రవారం చర్చలు జరిగాయన్నారు. ఈ సందర్భంగా త్వరలో తమ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఈ నేపథ్యంలో సమ్మె వాయిదా వేశామని తెలిపారు. అందువలన సోమ, మంగళ వారాల్లో బ్యాంకులు యథావిధిగా పని చేస్తాయని వారు తెలిపారు.

ఘనంగా సత్యదేవుని ఆలయ వార్షికోత్సవం

అన్నవరం: సత్యదేవుని నూతన ఆలయానికి 13 సంవత్సరాలు పూర్తయి, 14వ ఏట అడుగు పెట్టిన సంద ర్భంగా రత్నగిరిపై శుక్రవారం ఘనంగా వార్షికోత్సవం నిర్వహించారు. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకూ పండితులు సత్యదేవునికి లక్ష తులసి పూజ, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి, భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు యనమండ్ర శర్మ, ప్రధానార్చకుడు ఇంద్రగంటి నరసింహమూర్తి, ఉప ప్రధానార్చకుడు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు, పరిచారకులు యడవిల్లి ప్రసాద్, వ్రత పురోహితులు చల్లపిళ్ల ప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమాలు నిర్వహించారు. 2012 మార్చి 14న జరిగిన సత్యదేవుని నూతనాలయ శిఖర ప్రతిష్ఠలో పాల్గొన్న విశ్రాంత వేద పండితుడు గొర్తి సుబ్రహ్మణ్య ఘనపాఠి, అర్చకులు గాడేపల్లి సత్యనారాయణ, శేషగిరి, విశ్రాంత వ్రత పురోహితులు ఆకొండి వ్యాసమూర్తి, ప్రయాగ వేంకట రమణలను ఈఓ వీర్ల సుబ్బారావు ఘనంగా సత్కరించారు. వారికి శాలువా కప్పి, సత్యదేవుని ప్రసాదం, ఫొటో, పారితోషికం అందజేశారు. వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి ఆలయాన్ని, ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

పడిపోతే.. ఫట్

- గుల్లబారుతున్న ఎముకలు
- వృద్ధులే కాదు.. యువతలోనూ సమస్య
- ఆస్టియోపొరోసిస్‌తో ప్రమాద ఘంటికలు
- ప్రతి ఐదుగురు మహిళల్లో ఇద్దరికి ముప్పు
- పోషకాహార, హార్మోన్ల లోపం, మారుతున్న జీవనశైలి కారణం



కాకినాడ ప్రభుత్వాస్పత్రి ఆర్థోపెడిక్ వార్డులో రోగులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లు ప్రజల ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బ తీస్తున్నాయి. ముఖ్యంగా శరీర నిర్మాణానికి ఆధారంగా నిలిచే ఎముకలు చాలా త్వరగా పటుత్వాన్ని కోల్పోతున్నాయి. చిన్నగా కాలు తడబడి కింద పడితే చాలు.. ఫట్‌మంటూ విరిగిపోతున్నాయి. ఇక ద్విచక్ర వాహనాల పైనుంచి పడితే మల్టిపుల్ ఫ్రాక్చర్లు అవడం అనేది సర్వసాధారంగా మారిపోతోంది. చిన్నారుల నుంచి మూడు పదుల వయస్సు కూడా నిండని యువతలో సైతం ఎముకలు పటుత్వం తగ్గుతోంది. ఎముకలు గుల్లబారడం, బలహీనపడటం, తేలికగా విరిగిపోయే స్థితిని వైద్య పరిభాషలో (ఆస్టియోపొరోసిస్) అంటారు. పౌష్టికాహార లోపం, వయోభారం, కాల్షియం, డి-విటమిన్ లోపం దీనికి ప్రధాన కారణాలని ఆర్థోపెడిక్ సర్జన్లు (ఎముకల శస్త్రచికిత్స నిపుణులు) చెబుతున్నారు. వీటికి తోడు హార్మోన్ల అసమతుల్యత, వారసత్వ (జెనిటిక్) ప్రభావం, మద్యపానం, ధూమపానం, శారీరక వ్యాయామం లేకపోవడం కూడా ఎముకల ఆరోగ్యంపై ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.

యువతలో సైతం..

ఒకప్పుడు ఆరు పదుల వయస్సు మీద పడినా చాలా మందిలో ఎముకలు బలహీన పడటమనే సమస్య ఉండేది కాదు. మారిన జీవన విధానంతో ఇప్పుడా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ముఖ్యంగా ఆహార విధానంలో వస్తున్న మార్పులు ఎముకల పటుత్వాన్ని దెబ్బ తీస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. అందువల్లనే ఈ సమస్య ఇప్పుడు అన్ని వయస్సుల వారిలోనూ కనిపిస్తోందని అంటున్నారు. యువతలో ఈ సమస్య ఉంటే జువైనల్ ఆస్టియోపొరోసిస్ అని వైద్య పరిభాషలో పిలుస్తారు. ఆహారంలో పోషకాల లోపం ఉండటం, రోడ్డు పక్కన ఆహారం, జంక్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం, హార్మోన్లు అవసరమైన స్థాయిలో ఉత్పత్తి కాకపోవడం, స్టెరాయిడ్ల వంటి మందులు అధికంగా వినియోగించడం, రుమటాయిడ్ ఆర్థరైటిస్, లూపస్ వంటి వ్యాధుల బారిన పడిన యువతీయువకులు ఎముకల పటుత్వం కోల్పోతున్నారని వైద్యులు నిర్ధారించారు. కాల్షియం లోపంతో పుట్టడం వలన కూడా ఎముకలు గుల్లబారుతూండటం ఇటీవల ఎక్కువైందని ఇటీవల కాకినాడ జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగ వైద్యుల పరిశీలనలో తేలింది.

మహిళల్లో సైతం..

యువత తరువాత ఈ సమస్య మహిళల్లో తీవ్రంగా కనిపిస్తోందని వైద్యులు నిర్ధారించారు. ప్రతి ఐదుగురు మహిళల్లో కనీసం ఇద్దరు ఆస్టియోపొరోసిస్‌తో బాధ పడుతున్నారని చెబుతున్నారు. ముఖ్యంగా 50 సంవత్సరాలు దాటిన మహిళల్లో రుతుచక్రం ఆగిపోయే (మెనోపాజ్) దశలో ఈస్ట్రోజన్ హార్మోన్ ఉత్పత్తి తగ్గిపోతూంటుంది. దీనివలన ఎముకల సాంద్రత తగ్గిపోతుంది. అదే పురుషుల్లో అయితే 60 సంవత్సరాలు దాటిన వారిలో ఈ పరిస్థితి కనిపిస్తోంది.

మహిళల్లోనే ఎక్కువగా ఎముకలు గుల్లబారడానికి హార్మోన్ల లోపం, శారీరక నిర్మాణం, జీవనశైలి ప్రధాన కారణాలని వైద్యులు చెబుతున్నారు. పురుషులతో పోలిస్తే మహిళల్లో ఎముకలు సన్నగా, సున్నితంగా ఉండటం కూడా మరో కారణమని అంటున్నారు. గర్భిణుల్లో ఉండే కొద్దిపాటి కాల్షియాన్ని గర్భంలో ఉండే బిడ్డకు కూడా అందుతూంటుంది. దీనివల్ల కూడా వారిలో ఎముకల పటుత్వం తగ్గుతుంది. అలాగే, పిల్లలకు పాలిచ్చే సమయంలో పోషకాహారం లేకపోవడంతో శరీరంలో కాల్షియం నిల్వలు తగ్గిపోయి, ఎముకలు గుల్లబారుతూంటాయి. పాలిసిస్టిక్ ఓవరీ డిజార్డర్ (పీసీఓడీ), థైరాయిడ్, గర్భాశయ తొలగింపు (హిస్టరెక్టమీ) వంటి వాటి వలన హార్మోన్లలో విపరీతమైన అసమతుల్యత ఏర్పడి, మహిళల్లో ఎముకలు గుల్లబారుతున్నాయని వైద్యులు చెబుతున్నారు.

అప్రమత్తతే ఆయుధం

చిన్నచిన్న గాయాలైనప్పుడు తక్కువ ఒత్తిడితో కూడా ఎముకలు విరిగిపోతూంటాయి. నడుము, వెన్నెముక, కాళ్లలో దీర్ఘకాలిక నొప్పులు, వెన్నెముక దెబ్బతినడం, ఎముకలు కుచించుకుపోయి ఎత్తు, పొడవు తగ్గడం, నడుము, మోకాళ్లు, భుజాల జాయింట్లలో నొప్పి, నిస్సత్తువ వంటి లక్షణాలున్న వారు వైద్యుల సూచనల మేరకు తప్పనిసరిగా తగిన పరీక్షలు చేయించుకోవాలి. ముఖ్యంగా బోన్ మినరల్ డెన్సిటీ (బీఎండీ), ఎముకల క్షీణతను గుర్తించే ఎక్స్‌రే, ఎంఆర్ఐ స్కాన్, కాల్షియం, విటమిన్-డి స్థాయి అంచనా వేసేందుకు రక్త, మూత్ర పరీక్షల వంటివి తప్పనిసరి అని వైద్యులు చెబుతున్నారు. 50 ఏళ్ల వయస్సు దాటిన మహిళలు, 65 ఏళ్లు పైబడిన పురుషులు ఆరు నెలలకోసారి వైద్యులను సంప్రదించి, ఈ పరీక్షలు చేయించుకోవాలి. కుటుంబంలో ఎవరికైనా ఆస్టియోపొరోసిస్ ఉన్నా, నీడ పట్టున, ఏసీలలో ఎక్కువ సమయం గడిపే ఉద్యోగులు, ఇతర వర్గాలు, ధూమపానం, మద్యపానం అలవాటు ఉన్న వారు, హార్మోన్ల అసమతుల్యత, పోషకాహార లోపంతో వివిధ అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారు కచ్చితంగా తగిన పరీక్షలు చేయించుకోవాలి.

ప్రతి నెలా 3 వేల మంది పైనే..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రి (జీజీహెచ్) ఎంతో ప్రధానమైనది. ఇక్కడకు కోనసీమ, రాజమహేంద్రవరం ప్రాంతాల నుంచే కాకుండా పొరుగున ఉన్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సైతం అనేక మంది చికిత్స కోసం వస్తూంటారు. కేవలం ఈ ఒక్క ఆసుపత్రికే ప్రతి నెలా 3 వేల మందికి పైగానే రోగులు ఎముకల సంబంధిత సమస్యలతో వస్తున్నారు. ఇతర ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కూడా కలిపితే ఈ సంఖ్య మరింత అధికంగా ఉంటుంది. దీనినిబట్టి సమస్య ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఏడు నెలలుగా ఎముకల సమస్యలతో కాకినాడ జీజీహెచ్‌కు వచ్చిన రోగులు

నెల	రోగులు
2024 ఆగస్టు	2,891
సెప్టెంబర్	3,001
అక్టోబర్	3,169
నవంబర్	2,929
డిసెంబర్	3,315
2025 జనవరి	3,474
ఫిబ్రవరి	3,602



ఎముక పటుత్వాన్ని పరీక్షిస్తున్న నిపుణులు



నిర్లక్ష్యం చేయకండి



ఎముకల బలహీనత ఉందనే అనుమానం ఎవరికైనా ఉంటే తక్షణం కాకినాడ జీజీహెచ్‌కు రావాలి. బీఎండీ పరీక్షలు జీజీహెచ్‌లో ఉచితంగా చేస్తున్నాం. మందులు ఉచితంగా అందిస్తున్నాం. బీఎండీ పరీక్షల కోసం ప్రత్యేక క్యాంపులు కూడా నిర్వహిస్తున్నాం. ఆస్టియోపొరోసిస్ చిన్న సమస్య అని నిర్లక్ష్యం చేయకండి. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల జీవిత కాలాన్ని కూడా ఇది ప్రభావితం చేస్తుంది. కాల్షియం, విటమిన్-డి ఉన్న పోషకాహారం తీసుకోవాలి. అధిక ప్రొటీన్ ఉండే ఆహారంతో పాటు సూర్యరశ్మిలో గడపడం, తగినంత నిద్ర మేలు చేస్తాయి. వయస్సును బట్టి కనీసం ఏడు గంటల నిద్ర ఉండాలి. వయస్సుతో సంబంధం లేకుండా వ్యాయామాలు కచ్చితంగా చేయాలి.

– డాక్టర్ ఎం.పాండురంగ విఠల్, ఆర్థోపెడిక్ విభాగాధిపతి, జీజీహెచ్, కాకినాడ

ఉపాధి హామీలో కోనసీమ ఫస్ట్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (నరేగా) పథకం అమలులో అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఈ ఆర్థిక సంవత్సరంలో 57 లక్షల పనిదినాలకు గాను 56 లక్షలు పని దినాల కల్పన సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్‌లు అమరావతి నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో చిన్న, సన్నకారు రైతులకు చెందిన లక్ష ఎకరాల్లో పండ్ల తోటల పెంచడానికి ప్రణాళికలు సిద్ధం, పంట సేద్యపు నీటి కుంటల నిర్మాణం, పల్లె పండగ పనులైన గోకులాలు, సీసీ రోడ్లు నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో రోజువారీ సగటు వేతనాన్ని రూ.291.21 చెల్లిస్తూ కోనసీమ జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. జిల్లా వ్యాప్తంగా పల్లె పండగలో 896 గోకులాలు మంజూరు చేయగా వీటిలో 720 గోకులాలు నిర్మాణాలు పూర్తి అయ్యాయన్నారు.

జిల్లావ్యాప్తంగా 118 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు మంజూరు చేయగా వీటిలో 84 కిలోమీటర్లు అంతర్గత సీసీ రోడ్లు నిర్మాణం పూర్తయిందన్నారు. ఈ విభాగం బోగస్ మస్టర్లకు అడ్డుకట్ట వేయటంతో పాటు, పని వేళల్లో మార్పులు చేస్తూ కూలీలకు గిట్టుబాటు వేతనం అందించాలని సూచించారు. ఉద్యోగులు అవినీతికి పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ అవసరాలకు ఈ కుంటలను వినియోగించుకుంటూనే వీటిలో చేపల పెంపకం ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారని తెలిపారు. డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ ఎన్వీ కృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ పి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పకడ్బందీగా జవాబు పత్రాల మూల్యాంకనం

అమలాపురం టౌన్: అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి పలు పాఠ్యాంశాల జవాబు పత్రాలకు పకడ్బందీగా మూల్యాంకనం జరుగుతోందని డీఐఈవో వనుము సోమశేఖరరావు తెలిపారు. ఈనెల 1 నుంచి 20వ తేదీ వరకూ జరిగిన ఇంటర్ పరీక్షలకు సంబంధించి ఈ కళాశాలలో మూల్యాంకనం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 22 నుంచి అర్థ శాస్త్రం, భౌతిక శాస్త్రం జవాబు పత్రాలకు మూల్యాంకనం ప్రారంభమవుతుందన్నారు. ఇంటర్ రెండు సంవత్సరాలకు కలిపి భౌతిక శాస్త్రం 22,163, అర్థ శాస్త్రం 5,651 జవాబు పత్రాలు ఇక్కడ దిద్దవలసి ఉందని పేర్కొన్నారు.

సఖినేటిపల్లి రేవు వేలం పాట ఖరారు

సఖినేటిపల్లి: మాధవాయిపాలెం ఫెర్రీగా ప్రభుత్వ గుర్తింపు ఉన్న సఖినేటిపల్లి, నర్సాపురం రేవు బహిరంగ వేలంలో రూ.4,18,18,959తో హెచ్చుపాటదారుడైన శ్రీవిఘ్నేశ్వర కో ఆపరేటివ్ బోట్స్‌మెన్ సొసైటీ, టేకిశెట్టిపాలెం పేరున శుక్రవారం ఖరారు అయింది. ఫెర్రీకి 1-04-2025 నుంచి 31-03-2026 వరకూ టోల్స్ వసూలు హక్కులు పొందడానికి టెండర్ కం బహిరంగ వేలం నర్సాపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ వేలంలో పై మొత్తానికి పాట ఖరారు అయినట్టు సఖినేటిపల్లి ఎంపీపీ వీరా మల్లిబాబు మీడియాకు చెప్పారు. వేలం పాటలో జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీడీఓ కె.సూర్యనారాయణ, డివిజినల్ గ్రామ పంచాయతీ అధికారి పి.బొజ్జిరాజు పాల్గొన్నారు.

అధ్యయన విహారయాత్ర ఆరంభం




విహార యాత్రను ప్రారంభిస్తున్న డీఆర్‌వో రాజకుమారి

అమలాపురం రూరల్: కోనసీమ జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల విద్యా, విజ్ఞాన, అధ్యయన విహార యాత్ర బస్సులను కలెక్టరేట్ నుంచి శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారి రాజకుమారి జెండా ఊపి ప్రారంభించారు. ఈ విహారయాత్ర 23వ తేదీ వరకు 131 మంది 8 ,9 తరగతుల విద్యార్థులు, 20 మంది ఉపాధ్యాయులతో సాగుతుందన్నారు. ఈ యాత్రలో విద్యార్థులు తిరుపతిలోని ఐఐటీ తిరుపతి, రీజినల్ సైన్స్ సెంటర్, తిరుపతి జూలాజికల్ గార్డెన్, చంద్రగిరికోట వంటి ప్రముఖ విద్యా, శాస్త్ర, సాంస్కృతిక ప్రదేశాలను సందర్శించనున్నారన్నారు. ఉమ్మడి జిల్లాలోని కోరింగ అభయారణ్యాన్ని పరిశీలించనున్నారన్నారు. విద్యార్థులకు శాస్త్రీయ అవగాహన, ప్రకృతి పరిరక్షణ ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించేలా ఈ యాత్ర రూపొందించామన్నారు. డీఈవో షేక్ సలీం బాషా, ఉప విద్యాశాఖ అధికారులు జి.సూర్య ప్రకాశం, సుబ్రహ్మణ్యం, ఎంఈఓలు, జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారదర్శక ఎన్నికలకు సలహాలు

ఓటరు జాబితా సవరణ, ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి రాజకీయ పార్టీలు సూచనలు, సలహాలు తెలియజేయాలని జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎస్ రాజకుమారి కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా స్థాయి సూచనలు సలహాల సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణను మరింత పారదర్శకంగా, చేపట్టడానికి తరచూ సలహాలు ఇవ్వాలని ప్రతినిధులను కోరారు. ప్రతి మూడు మాసాలకు ఒకసారి 18 సంవత్సరాల నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకునే వెసులుబాటు ఉందని, గ్రామ సచివాలయాల్లో ఓటరుగా నమోదు చేసుకోవచ్చని అన్నారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, ఫారం 6, 7, 8 ల క్లైయిమ్‌లను పారదర్శకంగా పరిష్కరిస్తామన్నారు. టిడ్కో గృహాలలో ఉంటున్న వారికి స్థానికంగానే ఓటు ఉందని, వీరి ఓట్లను టిడ్కో ప్రాంతానికి మార్పు చేయాలని ప్రతినిధులు కోరగా చర్యలు చేపడతామని ఆమె తెలిపారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, రాజకీయ పార్టీల నాయకులు దూరి రాజేష్, చిక్కాల సతీష్, వడ్డీ నాగేశ్వరరావు, భవాని, ఉప తహసీల్దార్ శివరాజ్, జూనియర్ అసిస్టెంట్ సాయిరాం పాల్గొన్నారు.

25 నుంచి సీపీఎం ప్రజా చైతన్య సైకిల్ యాత్ర




ప్రజా చైతన్య సైకిల్ యాత్ర కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఎం నేతలు

అమలాపురం టౌన్: కొన్ని నెలలుగా పరిష్కారం నోచుకోని ప్రజా సమస్యలపై ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకూ ప్రజలను చైతన్య పరిచే దిశగా పలు మండలాల్లో సీపీఎం ఆధ్వర్యంలో సైకిల్ యాత్రను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రజా చైతన్య సైకిల్ యాత్రకు సంబంధించిన కరపత్రాలను పార్టీ నాయకులు శుక్రవారం విడుదల చేశారు. ఈ సైకిల్ యాత్రలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు పాల్గొంటారని పార్టీ జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీన అమలాపురంలోని కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. పట్టణంతోపాటు అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోని నాలుగు మండలాల్లో 60 కిలోమీటర్ల మేర సైకిల్ యాత్ర కొనసాగుతుందని తెలిపారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు అంగ్ర మాల్యాద్రి, జిల్లా కమిటీ ప్రతినిధులు జి.దుర్గా ప్రసాద్, టి.నాగ వరలక్ష్మి, శ్యామల, శివ తదితరులు సైకిల్ యాత్ర రూట్లను వివరించారు. జిల్లాలో భూస్వాముల ఆక్రమణల్లో ఉన్న కొబ్బరి చెట్లు పేదలకు పంచాలి, అక్రమ ఆక్వా చెరువులను అరికట్టాలి, కామనగరువులో ప్రభుత్వ వైద్య కళాశాల, ఆస్పత్రి ప్రభుత్వం అధీనంలో నిర్మించాలి, నడవాలి, అమలాపురంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి వంటి డిమాండ్లను సైకిల్ యాత్రలో ప్రజలకు వివరించి చైతన్య పరచనున్నారు.

శక్తి టీమ్‌లతో రక్షణ

వాహనాలను ప్రారంభించిన ఎస్పీ కృష్ణారావు



శక్తి టీమ్‌ల స్కూటీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎస్పీ కృష్ణారావు. చిత్రంలో ఏఎస్పీ ప్రసాద్, డీఎస్పీలు

అమలాపురం టౌన్: జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన అయిదు శక్తి టీమ్‌లను మహిళలు, బాలికలు సద్వినియోగం చేసుకుని రక్షణ పొందాలని ఎస్పీ బి.కృష్ణారావు సూచించారు. జిల్లాలో ఈ టీమ్‌లు ఆడపిల్లలు, మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసినట్లు వివరించారు. స్థానిక ఎస్పీ కార్యాలయం ప్రాంగణంలో ఈ శక్తి టీమ్‌ల సభ్యులైన మహిళా పోలీసులకు వాహనాలను (స్కూటీలు) ఎస్పీ కృష్ణారావు జెండా ఊపి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో అయిదు శక్తి టీములను అమలాపురం పోలీస్ సబ్ డివిజన్‌కు రెండు, కొత్తపేట డివిజన్‌కు రెండు, రామచంద్రపురం డివిజన్‌కు ఒకటి చొప్పున కేటాయించామని చెప్పారు. మహిళా టీమ్‌ల సభ్యులైన మహిళా పోలీసులు, ప్రారంభ కార్యక్రమానికి వచ్చిన మహిళలతో ఎస్పీ మాట్లాడారు. శక్తి వుమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ యాప్ ఉపయోగాలను ఎస్పీ వివరించారు. శక్తి టీమ్ ప్రతినిధులు తమకు కేటాయించిన ఏరియా పరిధిలోని ఆడపిల్లలు, మహిళలకు చేరువగా ఉండి వారితో సత్ సంబంధాలు నిర్వహించుకోవాలని సూచించారు.

జిల్లాలోని మహిళల్లో ఎవరికైనా ఎలాంటి సమస్య ఎదురైనా ముందు ధైర్యంగా ఉండి తర్వాత శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకుని సమాచారం అందించి వారి సహాయం, సేవలు పొందాలని ఎస్పీ కృష్ణారావు విజ్ఞప్తి చేశారు. ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, ఆర్మ్‌డ్ డీఎస్పీ సుబ్బరాజు, పట్టణ సీఐ పి.వీరబాబు, సోషల్ మీడియా సీఐ జి.వెంకటేశ్వరరావు, ఎస్పీ కార్యాలయం ఏవో జగన్నాథం, మహిళా ఎస్సై గంగాభవాని పాల్గొన్నారు.

కోకో సాగు విస్తరణకు ప్రణాళిక

కొత్తపేట: జిల్లాలో వెయ్యి ఎకరాల కొబ్బరిలో అంతర పంటగా కోకో విస్తరణకు చర్యలు తీసుకుంటున్నట్టు ఉద్యాన శాఖ కొత్తపేట ఏరియా అధికారి (హెచ్ఓ) జీ కోటేశ్వరరావు తెలిపారు. కొబ్బరి తోటల్లో కోకో సాగు విస్తీర్ణం పెంచే దిశగా జిల్లా ఉద్యాన శాఖ అధికార యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేసినట్టు ఆయన శుక్రవారం విలేకరులకు తెలిపారు.

దీనిలో భాగంగా రైతులకు ఎకరానికి 200 కోకో మొక్కలు చొప్పున పూర్తి రాయితీతో ఉచితంగా ఇవ్వనున్నట్టు తెలిపారు. మొక్కలు నాటుకోవడానికి, మిగతా యాజమాన్య పద్ధతులు చేపట్టి మొక్కలను పెంచుకోవడానికి ఉపాధి హామీ పథకం దోహదపడుతుందన్నారు. ప్రస్తుతం రైతులను గుర్తించి మొక్కలను వర్షాకాలం ఆరంభంలో రైతులకు అందజేస్తామన్నారు. కోకో మొక్కలు కావలసిన రైతులు తమ ఆధార్ కార్డు, భూమి పాస్ బుక్ లేదా 1 బి కాపీ, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో తమ గ్రామ పరిధిలో గల రైతు సేవా కేంద్రంలో పేరును నమోదు చేసుకోవాలని సూచించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	15,500
గటగట (వెయ్యి)	14,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	14,500
గటగట (వెయ్యి)	13,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

24న తాత్కాలికంగా కొన్ని రైళ్ల రద్దు

సామర్లకోట: దక్షిణ మధ్య రైల్వే, ఇంజినీరింగ్ అధికారుల సూచనల మేరకు ఈ నెల 24వ తేదీన కొన్ని రైళ్లు రద్దు చేసినట్లు రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ తెలిపారు. సామర్లకోట రైల్వే ఇంజినీరింగ్ శాఖ పరిధిలోని సామర్లకోట, పిఠాపురం, గొల్లప్రోలు, రావికంపాడు స్టేషన్ల మధ్య సిగ్నల్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా అధికారులు కొన్ని రైళ్లను రద్దు చేశరన్నారు. దీనిలో భా గంగా 17239, 22876 గుంటూరు-విశాఖపట్నం, రెండు రైళ్లు, 17240, 22875 విశాఖపట్నం- గుంటూరు, రెండు రైళ్లు, 17267 కాకినాడ పో ర్టు-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, 17268 విశాఖ- కా కినాడ పోర్టు, 67285 రాజమహేంద్రవరం-విశా ఖపట్నం, 67286 విశాఖపట్నం- రాజమహేంద్రవరం రైళ్లను తాత్కలికంగా రద్దు చేశామన్నారు.

తల్లి హత్య కేసులో కొడుకు అరెస్టు

కాకినాడ రూరల్: కాకినాడ ఎస్.అచ్యుతాపురంలో ఈ నెల 16న రాత్రి తల్లి షేక్ జహారా బీబీని హత్య చేసిన కొడుకు షేక్ షబ్బీర్ కమల్‌ను ఇంద్రపాలెం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎస్సై ఎం.వీరబాబు వివరాల ప్రకారం బీటెక్ మధ్యలో ఆపేసి ఇంటి వద్ద రెండేళ్లుగా ఖాళీగా ఉంటున్న కొడుకును ఏదో ఉద్యోగం చేసుకోవచ్చు కదా అని తల్లి తరచూ అనడంతో తీవ్ర ఆగ్రహానికి లోనై.. తల్లిని నుదిటిపై బలంగా గుద్దటంతో పాటు కుర్చీతో తలపై కొట్టి చంపాడు. నిందితుడు మానసిక పరిస్థితి కూడా బాగోక పోవడంతో మందులు కూడా వేసుకుంటున్నాడు. మృతురాలు బీబీ భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఇంద్రపాలెం పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు రిమాండ్ విధించినట్టు ఎస్సై వీరబాబు తెలిపారు.

త్వరలో కొత్త ట్రస్ట్‌బోర్డు?

- ముగిసిన అన్నవరం దేవస్థానం ధర్మకర్తల మండలి కాలపరిమితి
- ఈ నెలాఖరులోగా ఏర్పాటయ్యే అవకాశం
- ఎమ్మెల్యేలు, మంత్రుల నుంచి ఆశావహుల పేర్లు తీసుకున్న ప్రభుత్వం
- కొత్త ట్రస్ట్‌బోర్డులో చైర్మన్‌తో కలిసి 18 మంది సభ్యులు?
- ఇద్దరు చొప్పున అవకాశం కల్పించాలంటున్న బీజేపీ, జనసేన
- దాత, శ్రీలలితా ఇండస్ట్రీ అధినేత మట్టే సత్యప్రసాద్ పేరు సిఫారసు



అన్నవరం దేవస్థానం

అన్నవరం: స్థానిక శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి త్వరలో నూతన ధర్మకర్తల మండలిని నియమించనున్నారు. కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల భర్తీపై దృష్టి సారించింది. దేవస్థానం ధర్మకర్తల మండలి (ట్రస్ట్‌బోర్డు) కాల పరిమితి ఫిబ్రవరి ఎనిమిదో తేదీతో ముగిసిన విషయం తెలిసిందే. నూతనంగా ఏర్పాటయ్యే ధర్మకర్తల మండలిలో సభ్యత్వాల కోసం పేర్లు పంపించాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలువురు శాసనసభ్యులను తెలుగుదేశం పార్టీ అధిష్టానం గతంలోనే కోరింది. దీంతో మంత్రులు, ఆయా శాసనసభ్యులు ఆశావహుల జాబితాలను అధిష్టానానికి అందచేశారు. ఈ నెలాఖరులోగా ట్రస్ట్‌బోర్డు ఏర్పాటు అయ్యే అవకాశాలు ఉన్నాయని సమాచారం.

18 మందికి అవకాశం

కొత్త ట్రస్ట్‌బోర్డులో చైర్మన్‌తో సహా 18 మంది సభ్యులు ఉంటారని సమాచారం. దేవదాయశాఖ చట్టం ప్రకారం దేవస్థానం వ్యవస్థాపక కుటుంబానికి చెందిన ఐవీ రోహిత్ ఈ బోర్డుకు చైర్మన్‌గా నియమితులవ్వనున్నారు. సభ్యులుగా 17 మందిని నియమించనున్నారు. వీరిలో సుమారు 12 మంది పురుషులు, ఐదు లేదా ఆరుగురు మహిళలు ఉంటారని సమాచారం. అన్ని సామాజికవర్గాలతో బాటు, బీసీ, ఎస్‌సీ, ఎస్‌టీ, వర్గాలకు చెందిన వారికి ట్రస్ట్‌బోర్డులో స్థానం కల్పించనున్నట్టు సమాచారం.

గతంలో 16 మందితో..

2019లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి ప్రాతినిధ్యం ఉండాలని, 50 శాతం మహిళలు ఉండాలని భావిస్తూ మొత్తం 16 మందితో ట్రస్ట్‌బోర్డు ఏర్పాటు చేసింది. వీరిలో ఏడుగురు మహిళలు. మొత్తం 15 మందిలో ఎనిమిది మంది బీసీ, ఎస్‌సీ, ఎస్‌టీ వర్గాలకు చెందిన వారు కావడం విశేషం. 2019 ఎన్నికల్లో హామీ ఇచ్చిన హామీ ప్రకారం నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారికి కూడా ట్రస్ట్‌బోర్డులో స్థానం కల్పించారు. దేవస్థానం చరిత్రలో ఈ విధంగా సగం మంది మహిళలు, బీసీ, ఎస్‌సీ, ఎస్టీ వర్గాల వారికి ప్రాతినిధ్యం కల్పిస్తూ ఏర్పాటైన ట్రస్ట్‌బోర్డుగా నిలిచిపోయింది.

కొత్త ట్రస్ట్‌బోర్డు సభ్యత్వాల కోసం మంత్రులు, ఎంఎల్‌ఏ లపై వత్తిడులు:

అన్నవరం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యత్వాల కోసం పైరవీలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యేలు, మంత్రుల పై దిగువ శ్రేణి నాయకులు ఒత్తిడులు తెస్తున్నారు. అయితే ఇప్పటికే వారు ఈ పదవుల కోసం కొన్ని పేర్లు సిఫారసు చేసినట్టు సమాచారం.

- దేవస్థానానికి ఎక్కువ మొత్తంలో విరాళాలు సమర్పించిన దాతగా, స్వామి, అమ్మవార్లకు వజ్రకిరీటాలు చేయించడం, రూ.ఐదు కోట్లు వ్యయంతో ప్రసాదం భవనం నిర్మించిన పెద్దాపురానికి చెందిన శ్రీలలితా రైస్ ఇండస్ట్రీ ఎండీ మట్టే సత్యప్రసాద్ పేరు ఆ నియోజకవర్గం నుంచి సిఫారసు చేసినట్లు సమాచారం.
- ట్రస్ట్‌బోర్డులో బీజేపీ, జనసేన నుంచి ఇద్దరు చొప్పున నియమించాలని ఒత్తిడి వస్తున్నా ఒక్కొక్కరికి మాత్రమే అవకాశం ఉండనుంది. ఒకవేళ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గట్టిగా పట్టుబడితే రెండో వ్యక్తిని ఆ పార్టీ నుంచి నియమించే అవకాశం ఉంది.
- సత్యదేవుని ఆలయం కలిగిన ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి గతంలో మాదిరిగా ఇద్దరికి ట్రస్ట్‌బోర్డులో అవకాశం కల్పించనున్నారు. అయితే ఒకరు టీడీపీ, ఇంకొకరు జనసేన లేదా బీజేపీ నుంచి నియమితులవుతారని అంటున్నారు.
- జగ్గంపేట, కాకినాడ టౌన్ లేదా కాకినాడ రూరల్, తుని నియోజకవర్గాల నుంచి టీడీపీ నుంచి ఒక్కొక్కరికి ట్రస్ట్‌బోర్డులో అవకాశం లభించే అవకాశం ఉంది.
- అనపర్తి నియోజకవర్గం, కోనసీమ నుంచి కూడా ఒక్కొక్కరికి అవకాశం కల్పించనున్నారు.
- గతంలో గుంటూరు జిల్లా నుంచి కూడా ఒకరికి ఈ ట్రస్ట్‌బోర్డులో ప్రాతినిధ్యం కల్పించారు. అదే ఆనవాయితీని ఈ సారి కూడా పాటిస్తారంటున్నారు.

ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నిక

పెదవేగి: మండలంలోని విజయరాయి సీతారామ కల్యాణ మండపంలో శుక్రవారం కోకో రైతుల రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బొల్లు రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శిగా కె.శ్రీనివాస్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా ఎస్.గోపాలకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బోళ్ల సుబ్బారావు (పశ్చిమగోదావరి), పానుగంటి అచ్యుతరామయ్య (ఏలూరు), ఉప్పుగంటి భాస్కరరావు (కోనసీమ), గుదిబండి బండి వీరారెడ్డి (ఏలూరు), మార్ని శ్రీనివాసరావు (తూర్పుగోదావరి) సహాయ కార్యదర్శులుగా ఉప్పల కాశీ (తూర్పుగోదావరి), కొనరాజు రాధాకష్ణ (ఏలూరు), కొప్పిశెట్టి ఆనంద వెంకటప్రసాద్ (కోనసీమ), కోశాధికారిగా జాస్తి కాశీ బాబు (ఏలూరు) మరో 35 మందితో రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. కోకో రైతుల సమస్యలను పరిష్కరించాలని 24, 25 తేదీల్లో కోకో సాగు చేస్తున్న అన్ని జిల్లాల్లో ధర్నాలు, రాస్తారోకో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఆలిండియా సపక్ తక్రా పోటీల్లో ప్రతిభ



కానిస్టేబుల్ గౌతమ్‌ను అభినందిస్తున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్: ఆలిండియా పోలీస్ క్రీడా పోటీల్లో వరుసగా మూడోసారి పతకాలు సాధించిన యాంఢ్ర గౌతమ్‌ను ఎస్పీ బి.కృష్ణారావు తన కార్యాలయంలో శుక్రవారం అభినందించారు. ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకూ హర్యానా రాష్ట్రం మడగడలో జరిగిన 73వ ఆలిండియా పోలీస్ క్రీడా పోటీల్లో వాలీబాల్ క్లస్టర్ క్రీడా విభాగం విభాగంలో గౌతమ్ కాంస్య పతకాన్ని సాధించారు. జిల్లాకు చెందిన 2108 బ్యాచ్‌కు చెందిన సివిల్ కానిస్టేబుల్ గౌతమ్ సపక్ తక్రా క్రీడలో నైపుణ్యం సాధించాడు. గౌతమ్ సపక్ తక్రా క్రీడలో రాణిస్తూ ఇప్పటి వరకూ మూడు కాంస్య పతకాలు సాధించడం అభినందనీయమని ఎస్పీ కృష్ణారావు అన్నారు. 2003లో పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లోజరిగిన, 2024లో మహారాష్ట్రలోని నాగపూర్‌లో జరిగిన ఆలిండియా పోలీస్ క్రీడల్లో కాంస్య పతకాలు సాధించి ఇప్పుడు మరో కాంస్య పతకాన్ని కైవసం చేసుకోవడం విశేషమని ఎస్పీ కృష్ణారావు పేర్కొన్నారు.

మెడికల్ షాపుల్లో 'విజలెన్స్' తనిఖీలు

రికార్డులు సక్రమంగా లేని నాలుగు షాపులపై చర్యలు



అమలాపురంలోని ఓ మెడికల్ షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు

అమలాపురం టౌన్: స్థానికంగా ఉన్న పలు మెడికల్ షాపులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డ్రగ్స్, వాణిజ్య పన్నులు, లీగల్ మెట్రాలిజీ శాఖల అధికారులు మూకుమ్మడిగా, ఆకస్మికంగా శుక్రవారం దాడులు నిర్వహించారు. పట్టణంలోని ఎ టు జెడ్, మోహన్, లీలాశ్రీ, శ్రీదేవి మెడికల్ షాపుల్లో ఆ నాలుగు శాఖలకు చెందిన అధికారుల బృందం దాడులు నిర్వహించాయి. మెడికల్ షాపుల్లో ఎక్కడా ఎలాంటి నిషేధిత మందులు లభ్యం కాలేదని విజిలెన్స్ సీఐ మధుబాబు తెలిపారు. నాలుగు మెడికల్ షాపుల్లో మందుల కొనుగోళ్లు, అమ్మకాలకు సంబంధించిన రికార్డులు సక్రమంగా నిర్వహించడం లేదని అధికారులు గుర్తించారు. వాటిపై చర్యలకు సిఫారసు చేస్తూ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మురళీ తమ శాఖ ఏడీకి లేఖ రాశారు. త్వరలోనే ఈ షాపులకు షోకాజ్ నోటీసులు రానున్నాయని అధికారులు తెలిపారు. తనిఖీలు ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిర్వహించారు. తనిఖీల్లో పోలీస్ అధికారులు కూడా పాల్గొన్నారు. అధికారుల ఆకస్మిక దాడుల భయంతో పట్టణంలోని మిగిలిన మెడికల్ షాపులు, మెడికల్ ఏజెన్సీలకు చెందిన షాపులను ముందు జాగ్రత్తగా మూసివేశారు. ఈ దాడుల్లో డీసీటీవో నవీన్‌కుమార్, లీగల్ మెట్రాలిజీ ఇన్‌స్పెక్టర్ మురళీ పాల్గొన్నారు.

భార్యాభర్తల ఘరానా మోసం

- హవాలా డబ్బు, బ్యాంకు రుణాలు ఇప్పిస్తామని వంచన
- సుమారు రూ.2 కోట్లు పైనే మోసపోయినట్టు బాధితుల ఆవేదన

రావులపాలెం: అమాయకులకు బ్యాంకు రాయితీ రుణాలు ఇప్పిస్తామని నమ్మించడంతో పాటు, థర్డ్ పార్టీ హవాలా మనీ ఉందని, ఒకటికి పది రెట్లు వస్తుందని ఒక జంట పలువురిని నమ్మించి మోసగించిన సంఘటన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో వెలుగు చూసింది. గుంటూరు జిల్లా గుడివాడకు చెందిన ఆ జంట సుమారు పదేళ్ల క్రితం రావులపాలెం వచ్చి బ్యాంకు లోన్లు ఇప్పించే కన్సల్టెన్సీ నడుపుతూ జీవిస్తున్నారు. వీరు హవాలా మనీ ఉందని, సూర్యనందినీ మహిమ గల రాళ్లు ఉన్నాయని పలువురిని నమ్మించి రూ.కోట్లలో నగదు వసూలు చేసినట్టు సమాచారం. రావులపాలేనికి చెందిన వెంకట కృష్ణారెడ్డి, తన స్నేహితులు రూ.1.15 కోట్లు ఇచ్చి మోసపోయినట్టు తెలిపారు. అలాగే, పలువురు ఈ జంటకు రూ.లక్షల్లో సొమ్ములు ఇచ్చినట్టు కలకలం రేగింది. వీరిలో కొంతమంది తమ నగదు ఇవ్వాలని ఆ జంటను నిలదీయగా బ్యాంకు ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోట్లు ఇచ్చినట్టు బాధితులు తెలిపారు. వీరే కాకుండా మండలంలో పదుల సంఖ్యలో మోసపోయిన బాధితులున్నట్లు తెలుస్తోంది. వీరిలో ఒకరైన వెలగల వెంకట కృష్ణారెడ్డి తాము ఇచ్చిన నగదు ఇవ్వాలని ఎన్నిసార్లు చెప్పినా ఇవ్వడం లేదని, ఇంటికి తాళం వేసి ఉంటోందని, ఆ జంటలో భర్త కోసం గాలించారు. ఈ క్రమంలో అతడు ఒక హోటల్ ఉండటంతో పట్టుకుని కారులో ఎక్కించుకుని తీసుకు వస్తున్నాడు. అయితే, తనను కిడ్నాప్ చేశారంటూ కేసు పెడతానని బెదిరించి ఆ వ్యక్తి తప్పించుకుని పారిపోయినట్టు వెంకట కృష్ణారెడ్డి తెలిపారు.

ఆరుగురిపై కిడ్నాప్ కేసు

తనను బలవంతంగా ఆరుగురు వ్యక్తులు కారులో ఎక్కించుకుని కొట్టి తీసుకుని వెళ్లిపోయారని ఒక వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్టు సీఐ శేఖర్‌బాబు శుక్రవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. కేశనమటం రామకృష్ణ, అతని భార్య చైతన్యలు గుంటూరు జిల్లా గుడివాడలో ఉండేవారన్నారు. సుమారు పదేళ్ల క్రితం రావులపాలెం వచ్చి బ్యాంకు లోన్స్ కన్సల్టెన్సీ చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో వెలగల వెంకటకృష్ణారెడ్డి, మరికొంత మంది పరిచయమయ్యారు. రూ.80 లక్షల విలువైన సూర్యనందిని మహిమ గల రాయి కొనుగోలుకు వారు తనకు నగదు ఇచ్చారన్నారు. అయితే ఆ సొమ్ము అప్పుగా ఇచ్చామని, తిరిగి ఇవ్వాలంటూ వెంకట కృష్ణారెడ్డి, అతని స్నేహితులు తనను బెదిరిస్తున్నారన్నారు. తాను భయపడి ఒక హోటల్లో ఉండగా వీరందరూ ఈ నెల 19న తనను బలవంతంగా కారు ఎక్కించుకుని కొడుతూ దేవరపల్లి వద్ద కృష్ణంపాలెం తీసుకువెళ్లారన్నారు. రామకృష్ణ కొడుకు భరత్ ఫోన్ చేసి, తన తండ్రిని తీసుకువెళ్లడంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పడంతో వారు అతడిని తీసుకుని రావులపాలెంలో విడిచిపెట్టారన్నారు. అనంతరం రామకృష్ణ కొత్తపేట ఆస్పత్రి వెళ్లి చికిత్స చేయించుకుని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

70 రకాల డ్రగ్స్ పట్టివేత



దుకాణాలపై దాడులు చేస్తున్న ఏడీ నాగమణి, విజిలెన్స్ ఏఎస్పీ స్నేహిత, అధికారులు


కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో డ్రగ్స్ కంట్రోల్, విజిలెన్స్, ఈగల్ టీం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 70 రకాల నార్కోటిక్ డ్రగ్స్‌ను పట్టుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు చేపట్టిన ఈ దాడుల్లో సుమారు రూ.3 లక్షలకు పైగా విలువైన మత్తు మందులను అధికారులు గుర్తించారు. రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, రావులపాలెంతో పాటు పలు ప్రాంతాల్లో ఈ దాడులు జరిగాయి. డ్రగ్స్ కంట్రోలర్ ఏడీ డి.నాగమణి, విజిలెన్స్ ఏఎస్పీ ఎం.స్నేహిత ఈ దాడుల్లో పాల్గొని అనధికారంగా విక్రయించిన మత్తుమందులతో పాటు, పలు రకాల ఔషధాలను గుర్తించారు. నార్కోటిక్ డ్రగ్స్ హోల్‌సేల్ దుకాణల నుంచి ఎటువంటి బిల్లులు లేకుండా నేరుగా రిటైల్ దుకాణాలకు అమ్మడం, వారు తిరిగి వినియోగదారులకు విక్రయించడం ఈ దాడుల్లో కనుగొన్నారు. డాక్టర్ చీటీ లేకుండా మందులు అమ్మడం, బిల్లులు లేకుండా అమ్మడం, కొనడం నేరాల కింద ఉమ్మడి తూర్పుగోదారి జిల్లా పరిధిలో 20 దుకాణాలపై కేసులు నమోదు చేశారు.

పోక్సో కేసులో ఐదేళ్ల జైలు

అయినవిల్లి: అయినవిల్లిలంక గ్రామ శివారు గాలితిప్ప పేటకు చెందిన మూడేళ్ల బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ కాకినాడ పోక్సో కోర్టు జడ్జి ఓ.శ్రీదేవి శుక్రవారం తీర్పు వెలువరించినట్లు పి.గన్నవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రుద్రరాజు భీమరాజు, అయినవిల్లి ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపారు. 2023 మే 11న అదే గ్రామానికి చెందిన 50 ఏళ్ల డెక్క రాంబాబు మూడేళ్ల బాలికకు చాక్లెట్ ఇస్తానని చెప్పి ఆశ చూపి మాయమాటలతో తన ఇంటిలోకి అఘాయిత్యం చేశాడు. బాలిక తల్లి అదే రోజు ఫిర్యాదు ఇవ్వగా అప్పటి ఎస్సై నాగేశ్వరరావు పోక్సో కేసు నమోదు చేశారు. అప్పటి కొత్తపేట డీఎస్పీ కేవీరమణ దర్యాప్తు చేసి డెక్క రాంబాబును అరెస్టు చేసి కోర్టుకు అప్పగించారు. కాకినాడ పోక్సో కోర్టులో కేసు విచారణ జరగగా, పీపీ జి.వెంకటరత్నంబాబు ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో జడ్జి తీర్పు ఇచ్చారు.

నేత్రాలకు చల్లని నేస్తాలు!

- కూలింగ్ కళ్లద్దాలతో కంటికి రక్షణ
- రోజు రోజుకూ పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతలు
- కూలింగ్ గ్లాస్ కళ్లజోడుతో ఎండలో ప్రయాణం శ్రేయస్కరం
- జాగ్రత్తలు సూచిస్తున్న కంటి వైద్య నిపుణులు



కళ్లజోళ్ల షాపులో కూలింగ్ కళ్లజోళ్లు



కూలింగ్ కళ్లజోడు

కొత్తపేట: వేసవిలో శరీరంతో పాటు కళ్లమీద కూడా శ్రద్ధ చూపడం చాలా మంచిది. శరీరానికి వేడి చేయకుండా ఎప్పుడూ చల్లదనంలో ఆరోగ్య స్థితి మెరుగ్గా ఉండాలని జాగ్రత్తలు తీసుకుంటాం. గొంతెండిపోతే గుక్కెడు నీరు గానీ, శీతల పానీయాలు గానీ సేవించి సేద తీరుతాం. కానీ కళ్ల గురించి మాత్రం అంతలా పట్టించుకోం. కళ్లు పట్ల అశ్రద్ధ, నిర్లక్ష్యం కంటి వ్యాధులకు కారణమవుతాయి. వేసవిలో సరైన కంటి జాగ్రత్తలు తీసుకోకపోతే అపాయమేనని నేత్ర వైద్యులు చెబుతున్నారు. అత్యవసర సమయంలో ఎండలో తిరిగే ప్రతి ఒక్కరూ కూలింగ్ గ్లాసెస్ తప్పనిసరిగా వాడాలని చెబుతున్నారు. చలువ కళ్లజోళ్లు వాడడం వల్ల ఎండ వేడిమి నుంచి కళ్లను కాపాడుకోవచ్చని నేత్ర వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

చూపు మందగించే ప్రమాదం

కళ్లలోని అతి సున్నితమైన భాగాలకు వేడి తగలడం వల్ల చూపు మందగించే ప్రమాదం ఉంది. శరీర భాగాల్లో కళ్లు ఎంతో సున్నితమైనవి. ప్రధానమైనవి. మిట్ట మధ్యాహ్నం లేదా ఉష్ణ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో ప్రయాణం చేయడం కంటికి మంచిది కాదు. తప్పనిసరి పరిస్థితుల్లో వాహనం నడిపితే హెల్మెట్ లేదా కళ్లజోడును తప్పనిసరిగా పెట్టుకోవాలి. దుమ్ము, ధూళి కంటిలో పడడం వల్ల విపరీతమైన కంటి దురదలు ఏర్పడతాయి. నల్లగుడ్డు చుట్టూ పొరలు రావడం. ఎర్రని చారలు, కంటి వెంట తీగలాంటి స్రావం కారడం జరుగుతుంది. ఇటువంటి సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఒక్కోసారి జీవితాంతం చూపు కోల్పోయే ప్రమాదం ఉంది.

నలపకూడదు

మధ్యాహ్నం సమయంలో ఎండ చాలా తీవ్రంగా ఉంటుంది కళ్లకు రక్షణ కవచాలు లేకుండా తిరిగితే మంట పుట్టడంతో పాటు కళ్లు ఎరబ్రడ తాయి. ఇటువంటి సందర్భాల్లో కళ్లను చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. వెంటనే సమీపంలోని ఉన్న నేత్ర వైద్యులను సంప్రదించాలి. కళ్లను నలపడం చేయరాదు. తీవ్రమైన ఎండలో బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడల్లా సన్ గ్లాసెస్ ఉపయోగించాలి. బైక్, కారు లేదా మరేదైనా వాహనం నడుపుతున్నప్పుడు సన్ గ్లాసెస్ ధరించడం వల్ల దుమ్ము కణాలు లేదా వేడి గాలి కళ్లలోకి రాకుండా చేస్తుంది. ద్విచక్ర వాహనదారులు వీలైనంత వరకు క్లోజ్డ్ హెల్మెట్లను వాడటం మంచిది. 100% యూవీ రక్షణను అందించే నాణ్యమైన సన్ గ్లాసెస్‌ని వాడాలి. యూవీ కిరణాలు కళ్ళను దెబ్బతీస్తాయి. ఇది కంటి శుక్లం, మాక్యులార్ డీజెనరేషన్ వంటి సమస్యలకు దారితీస్తుంది. కాబట్టి యూవీఏ, యూవీబీ కిరణాలను నిరోధించే సన్ గ్లాసెస్ ఉపయోగించాలి.

కంటి చూపు మెరుగు కోసం ఆహారం

కంటి చూపు మెరుగుపరుచుకోవడానికి సమతుల ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. ప్రధానంగా తీసుకునే ఆహారంలో ఎక్కువగా యాంటీ ఆక్సిడెంట్లు. ఎ, సి విటమిన్లు ఉండేలా చూసుకోవాలి. ముఖ్యంగా ఆకుకూరలు అధికమొత్తంలో తీసుకోవాలి. ఎందుకంటే ఇవి పుష్కలంగా యాంటీ ఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. పాలకూర వంటివి కూడా కంటి ఆరోగ్యానికి బాగా సహాయపడతాయి. అలాగే ఒమెగా-3 కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉండే చేపలు తీసుకోవాలి. ఇవి కంటి చూపు మెరుగు పడేందుకు దోహదపడతాయి.

జాగ్రత్తలు పాటించాలి



వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. వెలుగును తట్టుకోలేని స్థితి ఈ కాలానికి ఉంది. జీవన ఉపాధి దృష్ట్యా ఎక్కువగా ఎండ బారిన పడిన వారు వారి విధుల మూలంగా ద్విచక్రవాహనాలపై ప్రయాణించినప్పుడు, రోడ్లపై వెళ్లేటప్పుడు వేసవిలో ఎండ ప్రభావంతో వచ్చిన వెలుతురు, వేడికి కళ్లకు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల వాళ్ల కళ్లలోని రక్షణ పొర కరిగిపోయి, వారి కళ్లు ఫొటో సెన్సిటివిటీకి గురవుతాయి. దాంతో కళ్లు మరింత సున్నితమైపోయి, క్రమేపీ వెలుగును చూడలేని స్థితికి చేరుకుంటాయి. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా బయటకు వెళ్లినప్పుడల్లా చలువ కళ్లద్దాలను, హెల్మెట్ లేదా క్యాప్ ధరిస్తూ జాగ్రత్తలు పాటించాలి.

– డాక్టర్ కె.శేషగిరిరావు, ప్రముఖ కంటి వైద్యుడు, కొత్తపేట

ఏపీఎస్పీ సిబ్బందికి ఉగాది పురస్కారాలు



మహోన్నత సేవా పతకం పొందిన ఏపీఎస్పీ కమాండెంట్ నాగేంద్రరావు

కమాండెంట్ నాగేంద్రరావుకు మహోన్నత సేవా పతకం

కాకినాడ రూరల్: కాకినాడ ఏపీఎస్పీ మూడవ బెటాలియన్ ప్రస్తుత కమాండెంట్ ఎం.నాగేంద్రరావుకు రాష్ట్ర ప్రభుత్వ ఉగాది మహోన్నత సేవా పతకం లభించింది. ఏపీ పోలీసు అండ్ ఫైర్ సర్వీసు పతకాలు- సేవా పతకాలను ఉగాది - 25కు శుక్రవారం ప్రకటించింది. నాగేంద్రరావు అక్టోపస్ ఎస్పీ (ఆపరేషన్స్ అండ్ అడ్మిన్)గా పనిచేసి ఇటీవల ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌కు వచ్చారు. అక్టోపస్ ఎస్పీగా అందించిన సేవలకు గాను ఆయనకు ఉగాది పురస్కారం లభించింది.

13 మంది ఏపీఎస్పీ బెటాలియన్ సిబ్బందికి పురస్కారాలు

కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ సిబ్బంది 13మందికి పతకాలు వరించాయి. అడిషనల్ కమాండెంట్ దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్ బి.శ్రీనివాస బాబ్జీ ఉత్తమ సేవా పతకాలు పొందారు. కఠిన సేవా పతకం హెచ్‌సీ బీవీ అప్పన్న, సేవా పతకాలను ఆర్‌ఐలు బి.శ్రీనివాసరావు, కె.రవిశంకరరావు, ఆర్ఎస్సైలు ఎం.,రాజా, డి.నిర్మలకుమార్, బి.రవిశంకరబాబు, ఏఆర్ఎస్సైలు బి.మోహనరావు, జి.ఆదియ్య, టి.సూర్యనారాయణ, డి.రామనాయుడు, ఎన్.జాకబ్‌రాజు పొందారు.